

సీవీఎస్వో శ్రీధర్ బాధ్యతల స్వీకారం



టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకమండపంలో బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించాక గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు.సీవీఎస్వో శ్రీధర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు శ్రీవారి ఫొటోతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం సీవీఎస్వో ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..టీటీడీలోని అన్ని విషయాలనూ అవగాహన చేసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తానని, ఆ శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




పొగడచెట్టుకు హారతి

పురుశైవారితోటలో మలయప్ప

భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది కూడా టీటీడీ తిరువాడిపురం శాత్తుమొరను వేడుకగా నిర్వహించింది.ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఆలయ వెనుకభాగంలోని పురుశైవారి తోటకు వేంచేశారు.నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి బయల్దేరారు. మార్గమధ్యంలో పొగడచెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారికి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లు మాడవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు.ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అంతరిక్షంపై అవగాహన పెంచుకోండి

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో రూపొందించే ఉపగ్రహాలను గురించి విద్యార్థులకు షార్ డైరెక్టర్ వివరించారు. సమాజం కోసం ఇస్రో చేపడుతున్న ప్రయోగాలు, కార్యక్రమాల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం అంతరిక్ష ప్రయోగాల గురించి చంద్రయాన్-3 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కల్పన చంద్రయాన్ వివరించారు.శాస్త్రవేత్తలు రఘురామ్, శంభుప్రసాద్, సీవీఎస్ కిరణ్, షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట





సమావేశంలో ప్రసంగిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

రక్తమోడిన తిరుమల ఘాట్

● బస్సు కిందపడి ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం


బస్సు కింద సౌమ్య, పక్కన కార్తీక్ మృతదేహాలు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ దర్శనమిచ్చే తిరుమల ఘాట్‌రోడ్డు బుధవారం మధ్యాహ్నం రక్తపు మరకలతో భయానకంగా మారింది. స్వామి క్షేత్రానికి చేరుకున్నామని ఆనందపడుతున్న భక్తులను ఆగిన బస్సు, దాని కింద రెండు మృతదేహాలు ఆందోళనకు గురిచేశాయి.మొదటిఘాట్ రోడ్డులోని చివరి మలుపు అంటే తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీప ప్రాంతంలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద లభించిన గుర్తింపుకార్డుల ఆధారంగా బైక్ నడుపుతున్న వ్యక్తి తమిళనాడులోని పళ్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28)గా తేలింది. ఇక, వెనుకభాగంలో కూర్చుని మృతి చెందిన మహిళ తిరువన్నామలై జిల్లాలోని చెంజాం తాలూకా, మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా పోలీసులు గుర్తించారు. ఉదయం 10.45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, మధ్యాహ్నం తర్వాత మృతదేహాలను పోలీసులు, హెల్త్ సిబ్బంది బస్సు కింద నుంచి తొలగించి అశ్విని ఆస్పత్రికి తరలించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ సంఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో బస్సు డ్రైవర్ కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశాలపై ఆరా తీస్తున్నారు.కాంతారావు మీడియాతో మాట్లాడుతూ.. బైక్‌పై వచ్చిన వారు తొలుత రైట్‌లో వచ్చేందుకు ప్రయత్నించి తర్వాత వేగంగా ఎడమవైపుకు వచ్చారని తెలిపారు. కనీసం హార్న్ కూడా కొట్టలేదని, బస్సును ఢీకొట్టి వారే కిందకు వెళ్లిపోయారన్నారు. మలుపు కావడంతో బస్సును వేగంగా కూడా నడపలేదని, బైక్‌పై వచ్చిన వారే మితిమీరిన వేగంతో వచ్చారని వివరించాడు. బస్సు ప్రమాదానికి కారణం ఎవరనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా కొద్దిరోజులుగా ఏసీ బస్సులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ముందు వెళుతున్న కార్లను, ద్విచక్రవాహనాలను సైతం ఓవర్‌టేక్ చేస్తున్నాయనే ఫిర్యాదులున్నాయి. భక్తుల కార్లతో పాటు టీటీడీ అధికారుల వాహనాలకు కూడా సైడ్ ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.పర్యావరణ పరిరక్షణ నినాదంతో తిరుమల-తిరుపతి మధ్య ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 62 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. వీటి డ్రైవర్లను బస్సు తయారీ సంస్థ అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించుకుంది. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినప్పటికీ ర్యాష్ డ్రైవింగ్‌తో విమర్శలపాలవుతున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతిలో గతనెల 11వ తేదీన 'తిరుమల ఘాట్‌లో ఏసీ బస్సుల దూకుడు' అనే శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. అయినప్పటికీ వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.ఎలక్ట్రిక్ బస్సులన్నిటికీ ముందు, వెనుకభాగంలో సీసీ కెమెరాలున్నప్పటికీ వాటిని ఆన్ చేయకుండా బస్సులు నడుపుతున్నట్టు బుధవారం జరిగిన ఘటనతో వెలుగు చూసింది.


బస్సు డ్రైవరును విచారిస్తున్న పోలీసులు

భాకరాపేట ఘాట్‌లో నడిరోడ్డుపై లారీ బోల్తా

చంద్రగిరి ఆగస్టు 7: చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌లో బుధవారం సాయంత్రం నడిరోడ్డుపై ఓ లారీ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి.వరదయ్య పాళెం మండలం కలత్తూరుకు చెందిన 11మంది వ్యాపారులు, కూలీలు ఎర్రావారిపాళ్యం మండలం వెళ్లారు.ఆ మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం సేకరించి లారీలో వేసుకొని వస్తుండగా భాకరాపేట ఘాట్‌లో అదుపుతప్పి రోడ్డుపై లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లయ్య, మునిభూషణం, మణి, బాలయ్య గాయపడ్డారు. నవీన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




బోల్తా పడిన లారీ (ఇన్‌సెట్‌లో) నవీన్ కుమార్ మృతదేహం

తిరుపతి కేంద్రంగా మరో డీసీసీబీ

● శాఖలు, సింగిల్ విండోలు కూడా


చిత్తూరు డీసీసీబీ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)లనూ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో చిత్తూరు డీసీసీబీని విభజించి తిరుపతి కేంద్రంగా మరొకటి ఏర్పాటు కానుంది. కొన్ని సింగిల్ విండోలు, శాఖలు అన్నమయ్య జిల్లాలో కలవనున్నాయి. అమరావతిలో ఇటీవల జరిగిన డీసీసీబీ సీఈవోల సమావేశంలో ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. 105 సంవత్సరాల చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ప్రధాన కార్యాలయంతో కలిపి 20 శాఖలు, 75 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2940 కోట్ల వ్యాపారం నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీ ఏడో స్థానంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించినా డీసీసీబీ మాత్రం ఇప్పటికీ ఉమ్మడిగానే కొనసాగుతోంది. దీనినీ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ శాఖలను, సింగిల్ విండోలను కూడా జిల్లాలవారీగా విభజించనున్నారు. ఈ ఏడాది ఆఖరిలోగా విభజన ప్రక్రియను పూర్తిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాస్తవానికి ఇదివరకే డీసీసీబీ పాలకవర్గాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో చిత్తూరు జిల్లా డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈయన డిసెంబరు వరకు కొనసాగనున్నారు. ఆలోగా బ్యాంకు విభజన ప్రక్రియ పూర్తిచేసి సింగిల్ విండోలకు, డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించాలా? లేక నామినేటెడ్ పద్ధతుల్లో త్రిసభ్య లేదా ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించాలా అన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

తిరుపతి డీసీసీబీకి 14 శాఖలు, 23 విండోలు

విభజన నేపథ్యంలో చిత్తూరులోని ప్రధాన కార్యాలయంతో కలిసి 20శాఖలు, 37 సింగిల్ విండోలతో చిత్తూరు డీసీసీబీ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసే తిరుపతి జిల్లా డీసీసీబీలో 14 శాఖలు, 23 సింగిల్ విండోలు ఉంటాయి. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాకు ఆరు శాఖలు, 15 సింగిల్ విండోలు విలీనం కానున్నాయి. విభజనపై సాధక బాధకాలను ఉన్నతాధికారులు త్వరలో పరిశీలించనున్నట్లు తెలిసింది.

స్కూళ్లలో ఎన్నికల వేడి

2334ప్రభుత్వ పాఠశాలల్లో నేడు యాజమాన్య కమిటీల ఎన్నికలు

ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



తిరుపతి(విద్య), ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు నేడు జరుగనున్నాయి.జిల్లాలోని 34 మండలాల్లో వున్న 1817 ప్రైమరీ పాఠశాలలు, 194 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 323 హైస్కూళ్లతో కలుపుకుని మొత్తం 2334 పాఠశాలల్లో యాజమాన్య ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ఆగస్టు ఒకటిన ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.ఎన్నికైన కమిటీలు రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఎన్నికలు పూర్తిగా రాజకీయ కోణంతో ఏకపక్షంగా జరిగిన విషయం తెలిసిందే. ఈసారి అలాంటి పొరబాట్లకు అవకాశం లేకుండా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి సేవా భావంతో కృషి చేసేవారికి ప్రాధాన్యం ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేశామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తల్లిదండ్రుల కమిటీలుగా వ్యవహరించిన వీటి పేరును పాఠశాల యాజమాన్య కమిటీలుగా మారుస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

వైసీపీ హయాంలో

పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు గతంలో 2021 సెప్టెంబరు 22న జరిగాయి. ఆ కమిటీల పదవీకాలం గతేడాది సెప్టెంబరుతో ముగిసింది. ఐతే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ కమిటీలను మరో ఏడాదిపాటు పొడిగించింది. దీంతో అప్పటి కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై 31వ తేదీతో ముగిసింది. దీంతో తాజాగా కొత్త కమిటీల ఎంపికకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల నిబంధనలను పట్టించుకోకుండా ఆ పార్టీ నాయకులకు నచ్చినవారిని ఎంపిక చేసుకున్నారు. ఈసారి అలాంటివి జరగరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విద్యాశాఖాధికారులను హెచ్చరించింది.

నేటి సాయంత్రం తొలి సమావేశం

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేస్తారు. తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తదితరాలను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయి. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలను పాఠశాలల్లో అందుబాటులో ఉంచి అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు.ఈ 15మంది సభ్యుల నుంచి అదేరోజు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేస్తారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఉంటుంది.ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. ఎన్నికల ప్రక్రియను ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల అధికారులు పర్యవేక్షిస్తారు.గురువారం ఉదయం7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ సభ్యులచే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ల ప్రమాణస్వీకారం, 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

వలంటీర్ల వాట్సప్ గ్రూపుల తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: గ్రామ, వార్డు వలంటీర్లు (విధుల్లో ఉన్న.. రాజీనామా చేసిన.. తొలగించిన)కు సంబంధించి వారి హౌస్‌హోల్డ్స్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులన్నిటినీ వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీఅయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థకు ఎటువంటి బాధ్యతలను కూటమి ప్రభుత్వం అప్పగించలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చేయడంతో పాటు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ సమాచారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేయాలని కూడా అందులో పేర్కొన్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు నెలలకు సంబంధించిన పెన్షన్లను వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

చేనేతలకు సబ్సిడీలు పునరుద్ధరిస్తాం

● కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి, ఆగస్టు 7:వ్యవసాయం తర్వాత ఎక్కువమంది ఆధారపడ్డ చేనేతరంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలోని పద్మశాలీయుల కళ్యాణ మండపంలో బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందిన వెంకటగిరి జరీచీరలకు రాన్రానూ డిమాండ్ తగ్గిందన్నారు.పవర్‌మిల్స్ రావడంతో పాటు అక్కడ తయారైన వస్త్రాలకు ఎక్కువ పబ్లిసిటీ ఇవ్వడం అందుకు కారణమన్నారు.వెంకటగిరిలో వర్షాల వల్ల రెండు మూడు నెలలు చేనేత పనులు స్తంభించడంతో నేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారని స్థానిక శాసనసభ్యుడు తన దృష్టికి తీసుకు వచ్చారని చెప్పారు. ఇందుకోసం సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు.వెంకటగిరిలోని 7 చేనేత సహకారసంఘాల వివరాలు తెప్పించుకుని వాటిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు.చేనేతలకు సబ్సిడీలను పునరుద్ధరించేందుకు బ్యాంకు అధికారులతో చర్చిస్తామన్నారు. టిడ్కో గృహాల్లో మగ్గాలు ఏర్పాటు చేసుకోలేకపోతున్నామని చేనేతలు వాపోతున్న దృష్ట్యా వారికి ప్రత్యామ్నాయం చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ చేనేత రంగాన్ని ఆదుకునేందుకు వారంలో ఒకరోజు ప్రతి ఒక్కరూ నేత కార్మికులు నేచిన దుస్తులు ధరించాలని సూచించారు.అనంతరం 60యేండ్లు దాటిన 10మంది చేనేత కార్మికులను సన్మానించారు.వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ,కమిషనర్ రషీద్, చేనేత యూనియన్ నేతలు అవ్వారు సత్యం, గంగాధర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు,మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, గౌరాబత్తిన చెంచయ్య, సామల లక్ష్మీపతి, హ్యాండ్‌లూమ్ ఏడీ పిచ్చేశ్వర్రావు, ఐఐహెచ్‌టీ ప్రిన్సిపాల్ గిరిధరరావు, వీవర్స్ సర్వీసు సెంటర్ ఇన్‌చార్జి విశ్వనాథం తదితరులు వున్నారు.అంతకుముందుగా క్రాస్ రోడ్డులో ఐఐహెచ్‌టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.


చేనేత కార్మికుడు బోడా సిద్ధయ్యకు సన్మానం

సిద్ధార్థలో ఓరియెంటేషన్ డే


కార్యక్రమంలో పాల్గొన్న చెంగల్‌రెడ్డి, ఆనందరెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, ఆగస్టు7: తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు బుధవారం ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రజా రవాణాధికారి టి.చెంగల్‌రెడ్డితో కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి కలసి కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, చైర్మన్ వై.కొండారెడ్డి, వైస్‌చైర్మన్ వై.విజయ్‌రెడ్డి, హెచ్ అండ్ ఎస్ హెడ్ డాక్టర్ పి.రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడండి


నోటికి నల్లబ్యాడ్జీతో మహేష్

తిరుపతి రూరల్, ఆగస్టు 7: బంగ్లాదేశ్‌లో నివసించే భారతీయ హిందువులకు రక్షణ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. తిరుచానూరులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుధవారం ప్లకార్డు చేతబట్టి సేవ్ బంగ్లాదేశ్ హిందూస్-టెంపుల్స్ అన్న నినాదాలు చేశారు. అక్కడి హిందూ ఆలయాలు ధ్వంసానికి గురి కాకుండా చూడాలన్నారు. అనంతరం నోటికి నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు



తిరుపతి రూరల్, ఆగస్టు7: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలోని ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపది సమేత ధర్మరాజస్వామి మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శించిన అర్జున తపస్మాన్ నాటిక కనులవిందుగా సాగింది. ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 11న ఉత్సవాలు ముగియనున్నాయని, చివరిరోజు అగ్నిగుండ ప్రవేశం, దుర్యోధుని వధ నాటిక ఉంటుందని వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారుడు జయసింహారెడ్డి, కమిటీసభ్యులు నాదమునిరెడ్డి, దేశిరెడ్డి, వెంకటరమణారెడ్డి, పూజారి జయకుమార్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం


జనార్దన్ రాజును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట/ ఎర్రావారిపాలెం: ఆగస్టు 7: చిన్నగొట్టిగల్లు తహసీల్దారుగా జనార్దన్ రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆయన్ను టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నేతృత్వంలో నేతలు సన్మానించారు. రెడ్డప్ప నాయుడు, వెంకటసుబ్బయ్య, చోటా సాహెబ్, బెల్లంకొండ రమణ, సుబ్రహ్మణ్యం, రఫీ, ప్రకాశ్, నాగరాజా, రాజగోపాల్ నాయుడు, ఎర్రయ్య నాయుడు, డీటీ అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.


పరమేశ్వర

ఎర్రావారిపాలెం తహసీల్దార్‌గా పరమేశ్వర బుధవారం బాధ్యతలు చేపట్టారు. భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. రైతుల పట్ల పారదర్శంగా వ్యవహరించాలని సూచించారు.

సన్మానం


శివరామసుబ్బయ్యను సన్మానిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

చంద్రగిరి: చంద్రగిరి తహసీల్దార్ శివరామ సుబ్బయ్యను బుధవారం ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.అన్వర్ బాషా, శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి ఏకే ప్రేమకుమార్ సన్మానించి పూలమొక్కలు అందజేశారు.

'అమరరాజా'లో 96 మందికి ఉద్యోగాలు

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపికలు


యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 7: ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థ, కరకంబాడిలోని అమరరాజా కంపెనీలో 96 మంది యువతీ యువకులు అప్రెంటిస్ ఉద్యోగాలు పొందారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమరరాజా కంపెనీలో మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు ఎంపికలు బుధవారం నిర్వహించింది. ఇంటర్, ఐటీఐ, పదో తరగతి పాస్, ఫెయిల్ 126 మంది యువతీ యువకులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు వి.కళ్యాణ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు ఆర్.లోకనాథం, గణేష్, మహేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 96 మంది ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి కనీస వేతనం కింద నెలకు రూ.12,500 నుంచి రూ.13,500 వరకు ఇస్తారని అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న 'టాస్క్‌ఫోర్సు'


బాధితులకు సాయం చేసిన పోలీసులు

మంగళం, ఆగస్టు 7: భాకరాపేట ఘాట్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదుకుని ఆస్పత్రికి తరలించారు. బుధవారం తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ బృందం భాకరాపేట వైపు కూంబింగ్ నిర్వహించేందుకు వెళుతుండగా మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ మలుపులో ఓ లారీ బోల్తాపడి ఉండటాన్ని గమనించారు. స్పందించిన టాస్క్‌ఫోర్సు బృందం సహాయక చర్యలు చేపట్టింది. గాయాలై కదల్లేని స్థితిలో ఉన్నవారిని అంబులెన్సు కోసం ఎదురు చూడకుండా తిరుపతి రుయాస్పత్రికి తరలించడంతో స్థానికులు అభినందించారు.

ఎంబీయూలో నేడు అంతరిక్ష దినోత్సవం

చంద్రగిరి, ఆగస్టు 7: చంద్రగిరి మండలం ఎం.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ)లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి రెండ్రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇస్రో (షార్-ఎన్‌ఏఆర్‌ఎల్), ఎంబీయూ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, షార్ డైరెక్టర్ రాజరాజన్, ఎన్‌ఏఆర్‌ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర, శాస్త్రవేత్తలు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాలనుంచి 150 మందికిపైగా ఇంజనీరింగ్,డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. క్విజ్, వీల్స్ స్పేస్ సైన్స్ ఎగ్జిబిషన్,మోడల్ శాటిలైట్ నమూనా ప్రదర్శిస్తారని రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి తెలిపారు.

అది చిరుత పులి కాదు

● అటవీశాఖ బృందం

రామచంద్రాపురం, ఆగస్టు 7: పరమాల పొలాల్లో ఆవుదూడను చంపి తిన్నది చిరుత పులి కాదని అటవీశాఖ అధికారుల బృందం బుధవారం తేల్చింది. సోమవారం రాత్రి దూడను చంపి సగం తినేసిన ఘటనపై 'చిరుత పులా.. రేసు కుక్కలా?' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. బీట్ అధికారి కిషోర్ సంఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించి అడవి జంతువు పాదముద్రలను సేకరించిన విషయమూ తెలిసిందే. అయితే బుధవారం మధ్యాహ్నం పరమాల ఉన్నత పాఠశాల విద్యార్థులు.. మూడు పిల్లలతో ఉన్న చిరుతను చూశామని గ్రామస్తులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే అటవీశాఖ అధికారులకు ఉపాధ్యాయులు సమాచారం ఇచ్చారు. దీంతో తిరుపతి నుంచి నలుగురు సభ్యులున్న అటవీశాఖ బృందం పరమాల పాఠశాల విద్యార్థులను విడివిడిగా విచారించారు. ఓ విద్యార్థి మూడు పిల్లలున్న చిరుతను 200 మీటర్ల దూరం నుంచి చూశామని, మరో విద్యార్థి చిరుతను మాత్రమే చూశానని పొంతనలేని సమాధానం ఇచ్చారు. ఇక రెండ్రోజులుగా వర్షం కురుస్తుండటంతో చిరుతను విద్యార్థులు చూశామని చెబుతున్న స్థలం బురదమయంగా ఉంది. అక్కడ ఎలాంటి అడవి జంతువు ఆనవాళ్లు లేకపోవడంతో అటవీశాఖ అధికారులు చిరుత కాదు రేసు కుక్కలే అని నిర్ధారణకు వచ్చారు. చిరుత ఏదైనా జంతువుమీద దాడి చేస్తే తొలుత గొంతు వద్ద పట్టుకుని రక్తం తాగాక మాత్రమే మాంసం తింటుందన్నారు. దూడ ఘటనలో వెనుకభాగం తిని ఉండటంతో ఇది చిరుత పులి కాదని తేల్చారు.


కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు

మూలస్థాన ఎల్లమ్మ కుంభాభిషేక ఉత్సవం

చంద్రగిరి ఆగస్టు 7: చంద్రగిరి పట్టణంలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ తల్లి ఆలయంలో యంత్రశిఖర ప్రతిష్ఠ శిఖర శతచండీ సహిత సహస్ర కలశ కుంభాభిషేక మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. తొలి రోజు పూజల్లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పాల్గొన్నారు. ఉదయం స్వస్తితో యాగశాల ప్రదర్శనం, భూత బలిహరణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితరాలు నిర్వహించారు. సాయంత్రం మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, చండీ మండపారాధన, ఆవరణ, మూలమంత్ర, తదితరాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ యారాసి చంద్రశేఖర్ రెడ్డిని సన్మానించి, అభినందించారు.

వ్యర్థాలతో కనుమరుగవుతున్న బొమ్మయ్యకుంట


వ్యర్థాలతో పూడ్చివేతకు గురైన బొమ్మయ్యకుంట


ముళ్లకంపలతో కప్పేసిన బొమ్మయ్యకుంట

పాకాల, ఆగస్టు 7: వ్యర్థాలతో, ఆక్రమణలతో బొమ్మయ్యకుంట కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. పాకాల రెవెన్యూ గ్రామం పాకాల పంచాయతీ పరిధిలోని పట్టణానికి అతి సమీపంలో ఉన్న బొమ్మయ్యకుంట ఒకప్పుడు మంచి నీటి కుంట. గాంధీనగర్ సమీపంలోని కొండలపై కురిసిన వర్షం నీళ్లు రైల్వే కాలనీ గుండా బొమ్మయ్యకుంటకు చేరేది. కొద్దిపాటి వర్షాలకు ఈ కుంట నిండిపోయేది. ఈ కుంట కింద ఆయకట్టుకు సాగునీటితో పాటు పాకాల న్యూకాలనీ, పొగతోట, భారతంమిట్ట పరిసరాలలో బావుల్లో, బోర్లలో సమృద్ధిగా నీళ్లు ఉండేవి. కాలక్రమంలో పట్టణంలో నివాస గృహాలు పెరగడంతో ఈ కుంటకు వెళ్తున్న వర్షపు నీటి కాలువ మురుగు కాలువగా మారిపోయింది. కాలువకు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. భవన నిర్మాణ వ్యర్థాలు చెరువులో పోయడంతో క్రమేణా పూడికకు గురైంది. కొంతమంది చెరువు స్థలాన్ని ఆక్రమించుకొని నివాస గృహాలు నిర్మించుకున్నారు. కట్ట, చెరువులో వున్న స్థలం ముళ్లకంపలతో నిండిపోయింది. దీంతో పాటు చెరువు స్థలం కొంతమేర వాటర్ ప్లాంట్, ఫిట్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి అధికారులు కేటాయించడంతో అక్కడ నిర్మాణాలు వెలిశాయి. బొమ్మయ్యకుంట సమీపంలో ఓ చదరపు అడుగు రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతోంది. భవిష్యత్తులో ఈ కుంటలో ఆక్రమణలు పెరిగి చెరువు ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి బొమ్మయ్యకుంటను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ట్రెంచ్ కొట్టి పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. కుంటను ఆధునికీకరించి కట్టపై వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


చెరువు స్థలంలో నిర్మించిన వాటర్ ప్లాంట్, ఫిట్‌నెస్ సెంటర్ భవనం

విజన్.. కుప్పం!

● డాక్యుమెంట్ రూపకల్పనలో కడా కసరత్తు
● 16న సీఎం చంద్రబాబు వద్ద ప్రజెంటేషన్


విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సమావేశమైన అధికారులు

కుప్పం, ఆగస్టు 7: అభివృద్ధి మోడల్‌గా కుప్పాన్ని తీర్చిదిద్దే పని మొదలైంది. ఇందుకు అనుగుణమైన విజన్ డాక్యుమెంట్ రూపల్పనలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) నిమగ్నమైంది. ఈనెల 12లోగా దీనిని పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కడా పీడీ ప్రజెంటేషన్ చేయనున్నారు. గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో కుప్పం అభివృద్ధి పదేళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్న భావన నియోజకవర్గ ప్రజలలో బలంగా ఏర్పడింది. అందుకే ఈ పదేళ్ల వెనుకబాటుతనాన్ని కవర్ చేసుకుంటూ, వచ్చే పదేళ్లను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిని సాకారం చేయడానికి సీఎం సంకల్పించారు. సమర్థుడైన యువ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌కు కడా సారథ్య బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, నీటిపారుదల, ఇంకా ప్రభుత్వంలోని ప్రతి విభాగమూ ప్రస్తుతం కుప్పం విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములవుతున్నాయి. రెండు రోజులుగా రోజుకు రెండుమూడు ప్రభుత్వ శాఖాధికారులు, నైపుణ్యం కలిగిన ప్రైవేటు ఏజెన్సీలతో కలిసి కడా కార్యాలయంలో సమావేశమై సమీక్షలు జరుపుతున్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ, ఏపీఐఐసీ తదితర ప్రభుత్వ విభాగాల సమావేశం జరిగింది. విజన్ డాక్యుమెంట్ పూర్తయిన తర్వాత స్థానికులైన మేధావులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశమై సలహాలు, సూచనలు తీసుకుంటారు. అనంతరం ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో విజన్ డాక్యుమెంట్‌పై కడా పీడీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి సూచనల ప్రకారం మార్పుచేర్పులుంటాయి. రాబోయే మూడేళ్లలో కుప్పం నియోజకవర్గాన్ని నమూనా నియోజకవర్గంగా అభివృద్ధి చేసి చూపించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. తర్వాత రాష్ట్రం మొత్తం కుప్పం మోడల్‌గా అభివృద్ధి చేపడతారు.

డాక్యుమెంట్‌లో ఏముంటుందంటే..

కుప్పం నియోజకవర్గ అభివృద్ధికోసం ఏయే ప్రభుత్వ శాఖలనుంచి ఏయే పనులు చేపట్టవచ్చు, ఆ పనులు త్వరితగతిన, మరింత నైపుణ్యంగా, మెరుగ్గా, మంచి ఫలితాలు ఇచ్చేలా వినూత్నమైన ఆలోచనలు ఏమిటి, అటువంటి వినూత్న ఆలోచనలు కార్యరూపంలో ఎలా పెట్టొచ్చు వంటి అంశాలు విజన్ డాక్యుమెంట్‌లో చోటు చేసుకుంటాయి. మురుగు నీటి కాలువల నిర్మాణంనుంచి కార్గో ఎయిర్ పోర్టు దాకా, వ్యవసాయం నుంచి సెజ్ (పారిశ్రామికవాడ అభివృద్ధి) దాకా ఇందులో పలు అంశాలు చోటు చేసుకోనున్నాయి. ఆయా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి ఒక అంచనా బడ్జెట్‌ను కూడా డాక్యుమెంట్‌లో పేర్కొంటారు. ఈ విజన్ డాక్యుమెంట్ అమల్లోకి వస్తే సంభవించబోయే అభివృద్ధి ఫలాలు ఎలా ఉంటాయో కూడా అంచనా వేస్తారు. కుప్పం నియోజకవర్గంలో జీరో పావర్టీ, తలసరి ఆదాయం పెంపు, ఉద్యోగ ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబనతోపాటు సకల రంగాల అభివృద్ధి అంతిమంగా విజన్ డాక్యుమెంట్ లక్ష్యం.

సహకార సంఘాల్లో సీఈవోల పెత్తనం

● దశాబ్దాలుగా తిష్ఠవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(సింగిల్ విండో)లో ఆధిపత్య పోరు సాగుతోంది. 76 సింగిల్ విండోలకుగాను చాలాచోట్ల 20-30 ఏళ్ళుగా సీఈవోలు తిష్టవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిన్నటివరకు త్రీమెన్ కమిటీని, ఇప్పుడు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిని సైతం లెక్కచేయడం లేదు. పలుచోట్ల సీఈవోలే సింగిల్ విండోల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి డీసీసీబీ సీఈవో, డీసీవోలే భయపడుతున్నారు.

రైతులకు చేదోడుగా ఉండాల్సిన సింగిల్ విండోల్లో గత ఐదేళ్లలో త్రీమెన్ కమిటీలు ఉండేవి. నెల క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పడి, ఆ కమిటీలను రద్దుచేసి సహకార శాఖకు చెందిన సీనియర్, జూనియర్ రిజిస్ట్రార్లను, ఆడిటర్లను అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. అప్పుడు, ఇప్పుడు రైతులకోసం పనిచేయాల్సివుండగా ఏళ్ళ తరబడి తిష్టవేసిన సీఈవోలు లెక్కపెట్టకపోవడంతో కమిటీలు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. ఒకవేళ ఎన్నికలు జరిగితే సొసైటీల చైర్మన్ పదవీకాలం ఐదేళ్లే. కానీ సీఈవోలు మాత్రం ఉద్యోగ విరమణ చేసేంతవరకు తమను ఎవరూ ఏమీ చేయలేరనే అభిప్రాయంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కమిటీ చైర్మన్లకు అప్పట్లో, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలకు ఇప్పుడు సీఈవోలతో పొసగక సమస్య జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతింటోంది. సింగిల్ విండోల్లో కోల్డ్‌వార్‌తో తిరోగమన దిశగా పయనిస్తోందన్న చర్చ సాగుతోంది.

డీఎల్‌ఈఎస్ భేటీలు కరువు

సింగిల్ విండోల బాగోగులు, సీఈవోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన డిస్ట్రిక్ లెవల్ ఎంపవర్డ్ కమిటీ (డీఎల్‌ఈఎస్) ఎప్పుడూ భేటీ కాలేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్ (ఇప్పుడు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ)తో పాటు బ్యాంకు సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. సింగిల్ విండోల్లో సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయ పరచడం, అవసరమైతే సీఈవోలను ఇతర సొసైటీలకు బదిలీ చేయాలని ఆప్కాబ్‌కు సిఫార్సుచేయడం ఈ కమిటీ విధి. సింగిల్ విండో కమిటీ అధికారులు, సీఈవోల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించి సొసైటీల ద్వారా రైతులకు మేలు చేకూర్చేలా డీఎల్‌ఈఎస్ కమిటీ వ్యవహరించాలి. రైతులకు రుణాలిచ్చే విషయంలో రాజకీయ నేతలకు, రైతుల మధ్య ఘర్షణ వైఖరి కల్పించి కోరిన వారికి మాత్రం నిబంధనలకు మించి రుణాలివ్వడం, కాని వారికి సీఈవోలు రిక్త హస్తం చూపుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

డీఎల్‌ఈఎస్ నిర్ణయంతోనే బదిలీలు

దీర్ఘకాలికంగా సొసైటీల్లో పనిచేస్తున్న సీఈవోల బదిలీలతో పాటు అన్ని సొసైటీలలో బదిలీలపై డీఎల్‌ఈఎస్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కమిటీ తీర్మానం మేరకు బదిలీల ఉత్తర్వులు వస్తే ఆ ప్రక్రియను డీసీసీబీ సీఈవో నిర్వహిస్తారు. కొన్ని సొసైటీల్లో దీర్ఘకాలంగా సీఈవోలు ఒకే ప్రాంతంలో పనిచేస్తుండడంతో సమస్యలు ఏర్పడిన పరిస్థితులు మా దృష్టికి వచ్చాయి.

- నాగవర్ధన, డీసీవో, చిత్తూరు

సీఈవోల బదిలీ విషయంలో ఆప్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని దాదాపు 50కి పైగా సింగిల్ విండోల్లో సమస్యలు జటిలంగా మారుతున్నాయి. ఇప్పటికైనా డీసీసీబీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ డీఎల్‌ఈఎస్ భేటీ నిర్వహించి, సొసైటీల పరిస్థితులను అంచనా వేయడంతో పాటు దీర్ఘకాలంగా తిష్టవేసిన వారికి స్థానచలనం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

బదిలీలపై దృష్టి సారించని ఆప్కాబ్

వాస్తవానికి సింగిల్ విండోల సీఈవోల బదిలీని ఆప్కాబ్ పర్యవేక్షించాలి. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియను చూడాలి. జిల్లా సహకార బ్యాంకుతో పాటు బ్రాంచుల్లో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేస్తున్నా, విండోల్లో మాత్రం సీఈవోల బదిలీపై దృష్టి సారించడం లేదు. దీంతో ఒకే విండోలో దశాబ్దాలుగా సీఈవోలు కొనసాగుతుండడం, నిధుల దుర్వినియోగం చేస్తూ పైవారి నిర్ణయాలను వారు ఖాతరుచేయడం లేదు. తమచే నిమితులైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సింది డీసీవోనే అంటూ డీసీసీబీ సీఈవో వెనుకడుగు వేస్తోంది.

- చిత్తూరు కలెక్టరేట్

తిరుపతిలో హర్యానా గ్యాంగ్ కదలికలు

● ఏటీఎంలే లక్ష్యంగా దోపిడీ చేయడమే వీరి పని
● జిల్లా పోలీసులను అప్రమత్తం చేసిన ఎస్పీ, ఇంటెలిజెన్సు వర్గాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 7: ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని లక్షలాది రూపాయలను దోపిడీ చేయడమే వీరి పని. ఏడాదిలో ఆరు నెలల పాటు కొన్ని జిల్లాలను ఎంచుకుని బృందాలుగా విడిపోతారు. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు సభ్యులు ఉంటారు. కుటుంబాలకు కుటుంబాలే ఇదే పనిలో ఉంటాయి. ఎవరెవరు ఏ జిల్లాలకు వెళ్లాలి? ఎన్ని రోజులు ఉండాలి? దోపిడీ ఎలా చేయాలి? డబ్బును ఎక్కడికి తరలించాలి? ఇలా.. పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తారు. వీరే హర్యానాలోని మేవాత్ వాసులు. మన రాష్ట్రంలోని స్టూవర్టుపురం, ఓజీ కుప్పం గ్యాంగ్‌ల్లాగా దోపిడీల్లో ఆరి తేరిన గ్యాంగ్ వీరిది.

ప్రత్యేక నిఘా

ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ముందస్తు జాగ్రత్తగా క్రైం డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో అన్ని స్టేషన్ల పోలీసులు అప్రమత్తం చేశారు. రెండ్రోజులుగా వారి పరిధిలోని ఏటీఎంలు పరిశీలించడం, ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే తమకు తెలియజేయాలని స్థానికులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గతంలో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడి జైలు నుంచి విడుదలైన నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో సీఐల నేతృత్వంలో రెండు బృందాలు పగటి పూట గస్తీ నిర్వహిస్తున్నాయి.

క్లాస్‌గా ఉంటారు

హర్యానా గ్యాంగ్ సభ్యులు పగటి పూట ఏటీఎంలున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తారు. సూటు, బూటు ధరించి క్లాస్‌గా కనిపిస్తారు. పైగా కారులో వస్తారు. ఏటీఎంల వద్ద ఎవ్వరూ లేని సమయంలో వచ్చి తమ కానిచ్చేస్తారు. ఇలాంటి గ్యాంగ్‌లు అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, సత్యసాయి జిల్లాల్లో తిష్ట వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా వారం వ్యవధిలో అనంతపురంలోని రెండు ప్రాంతాల్లో ఏటీఎంలను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి.. లక్షలాది రూపాయలు దోపిడీ చేశారు. వీరి కోసం ప్రత్యేక బలగాలు గాలిస్తున్నాయి. అయినా ఆచూకీ కనిపెట్టడం కష్టమని తిరుపతి క్రైం పోలీసులు చెబుతున్నారు. ఇపుడు హర్యానా గ్యాంగ్ కదలికలు జిల్లాలో ఉన్నట్లు అనుమానం రావడంతో మన పోలీసులను ఇంటెలిజెన్సు, స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) వర్గాలు అప్రమత్తం చేశాయి.

పదేళ్ల కిందట..

ఇలాంటి గ్యాంగ్‌లే పదేళ్ల కిందట ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూనియన్ బ్యాంకులోకి చొరబడి సిబ్బందిని తుపాకులతో బెదిరించి లక్షలాది రూపాయలు దోపిడీ చేసుకుని వెళ్లారు. ఈ దొంగలను పట్టుకోవడానికి దాదాపు ఏడు నెలల సమయం పట్టింది. అప్పట్లో జిల్లా అదనపు ఎస్పీగా పనిచేసిన శేషు.. నిందితులను విచారించి 70శాతం సొమ్మును రికవరీ చేయగలిగారు.

పంద్రాగస్టున జాతీయ పతాకాన్ని ఎగురవేసేదెవరో?

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: చిత్తూరు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం ఇంకా జరగలేదు. మరో పది రోజుల్లో చిత్తూరులో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో జాతీయ జెండాను ఎవరు ఎగురవేస్తారో, జిల్లా ప్రగతిపై ప్రజలకు ఎవరు సందేశమిస్తారో తెలియడం లేదు. ఆలోగా ఇన్‌చార్జి మంత్రి నియామకం పూర్తికాకుంటే ఎవరిచే పోలీసు పరేడ్ మైదానంలో త్రివర్ణ పతాకం ఎగురవేస్తారన్నది అర్థం కావడం లేదు. జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్ప మరెవరూ మంత్రులుగా లేరు. ఈ క్రమంలో జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం జరగని పక్షంలో సీనియర్ మంత్రుల్లో ఒకరికి అవకాశం కల్పిస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించడం కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి జిల్లా సమీక్షా మండలి సమావేశం నిర్వహిస్తారు. జిల్లా ప్రగతిని సూచించే వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి ఉషశ్రీ చరణ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించారు. ఆమె జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా ఉన్నా అన్ని సమావేశాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి హవానే కొనసాగేది. ఆ తర్వాత ఎన్నికల వాతావరణం రావడం, మార్చిలో ఎన్నికల కోడ్ ప్రకటించడంతో డీఆర్సీ నిర్వహించే అవకాశం లేకపోయింది. ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇంకా ఇన్‌చార్జి మంత్రిని ప్రకటించలేదు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 7: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాలలో బుధవారం హానికరమైన పొగాకు, మత్తుపదార్థాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల, డాక్టర్ మల్లికార్జున (శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల), ఆచార్య ముకుందనాయుడు (శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం) ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక దినోత్సవం

తిరుపతి అర్బన్, ఆగస్టు 7: శ్రీకృష్ణదేవరాయల 515వ పట్టాభిషేకం దినోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా కాపునాడు అధ్యక్షుడు సరిత నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం లీలామహల్ కూడలిలోని రాయలు విగ్రహానికి పూలమాలవేసి, నివాళి అర్పించారు. కాపునాడు స్టూడెంట్ లీడర్ డాక్టర్ మణిరాయల్, గౌరవాధ్యక్షులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్, మలిశెట్టి రమేష్‌బాబు, కంబాల జనార్దన్, నరేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాపునాడు నాయకులు

చిరస్మరణీయుడు బీపీ మండల్

తిరుపతి అర్బన్, ఆగస్టు 7: ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో 27శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు సాధించిపెట్టిన బీపీ మండల్‌ను లబ్ధిదారులందరూ నిత్యం స్మరించుకోవాలని ఏపీ బీసీ ఉద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పవన్ అన్నారు. బుధవారం డీబీఆర్ రోడ్డులో ఉన్న బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు సునీల్‌కుమార్‌యాదవ్, పెరుమాల్, వెంకటసుబ్బయ్య, మునిప్రకాష్, మునీంద్ర, శివ, హేమాద్రి, భూపతి, భానుప్రకాష్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

రేపు ఆదివాసీ దినోత్సవం

తిరుపతి (కపిలతీర్థం), ఆగస్టు 7: బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గుండాల నాయక్ తెలిపారు. ఆలిండియా బంజారా సేవా సంఘం నేతలతో కలిసి ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చే పథకాలను పూర్తిగా నిలిపేసిందన్నారు. ఆ పథకాలను తిరిగి తీసుకురావడమే కాకుండా గిరిజన కాలనీల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఇందులో భాగంగానే ఆదివాసీ దినోత్సవానికి ముఖ్య అతిథిగా కలెక్టర్‌తోపాటు తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొంటారని తెలిపారు. నేతలు శివనాయక్, కళావతి, కుసుమ, విజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న గుండాల నాయక్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి,బుధవారంఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 66,235 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 26,730 మంది తలనీలాలు సమర్పించారు.

'యాదవుల అభివృద్ధికి కృషి'

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 7: రాష్ట్రంలో యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శంకర్ యాదవ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఆయన్ను యాదవ సంఘం నేతలు రాజేష్ యాదవ్, కృష్ణ యాదవ్, సునీల్ యాదవ్ సన్మానించారు.



మీడియాతో శంకర్ యాదవ్

వైద్య విద్యపై నేడు రాష్ట్రస్థాయి సదస్సు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 7: వైద్యరంగంలో వస్తున్న పెనుమార్పులకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాలలో గురువారం 14వ రాష్ట్రస్థాయి వైద్య విద్యా సదస్సును నిర్వహిస్తున్నట్లు వైద్య విద్య ఉపాధ్యాయ సంఘం నేత డాక్టర్ కిరీటి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైద్య రంగంలోని నూతన అధ్యాయనాలకు సంబంధించి నిర్వహించే ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ప్రముఖ వైద్యులు పాల్గొంటారన్నారు. మూడ్రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో వైద్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కిరీటి

ప్రతి ఒక్కరి చేతిలో జాతీయ జెండా ఎగరాలి

తిరుపతి (కపిలతీర్థం), ఆగస్టు 7: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న దేశంలోని ప్రతి భారతీయుడి చేతిలో, ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని బీజేపీ నేతలు కోలా ఆనంద్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టడంతో ఈసారి ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో అమృత్ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ నేతలు వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 7: అలిపిరి- జూ పార్కు రోడ్డులో రెండ్రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి బుధవారం మృతి చెందాడు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన రాజవర్ధనరెడ్డి మోహన్‌బాబు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఈనెల 2న ద్విచక్ర వాహనంపై జూ పార్కు రోడ్డులో వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

రేపు గేట్ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

తిరుపతి(విద్య), ఆగస్టు 7: భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాలలో హెచ్‌సీఎల్-టెక్‌బీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో 75శాతం మార్కులతో ఇంటర్ (సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్‌కోర్సులు)పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://బిట్.ఎల్‌వై/టెక్‌బీగోఏపీ వెబ్‌సైట్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకోసం 63630 95030, 77803 23850 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7: ఎస్వీయూలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. డిక్సన్ టెక్నాలజీస్, విష్ణుకార్స్ ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఐటీఐ చదువుకున్న వారు అర్హులు. 365 పోస్టుల భర్తీకి ఈ మేళా చేపడుతున్నారు. 9న ఉదయం 11 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభం కానుంది. సమగ్ర వివరాలకు 95338 89902 నెంబరులో సంప్రదించాలని ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసులు సూచించారు.

గోవిందరాజస్వామి గుడిలో
ఆండాళ్ శాత్తుమొర

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 7: గోవిందరాజ స్వామి ఆలయంలో బుధవారం ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర ఘనంగా నిర్వహించారు. ఉదయం గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవర్లను ఊరేగింపుగా అలిపిరికి తీసుకెళ్లి, ఆస్థానం నిర్వహించారు. అక్కడినుంచి గీతామందిరం, రామనగర్ క్వార్టర్స్, వైఖానసాచార్యుల ఆలయం, ఆర్‌ఎస్ మాడవీధి, చిన్నజీయర్ మఠం మీదుగా ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకొచ్చారు. జీయరు స్వాములు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఈ ఏడాది డీఎస్సీ ఉన్నట్టా.. లేనట్టా ?
ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

తిరుపతి(విద్య), ఆగస్టు 7: ఈఏడాది డీఎస్సీ ఉన్నట్టా.. లేనట్టా..? స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు కోరారు. యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో టెట్, డీఎస్సీ నిర్వహించకపోవడమే కాకుండా 117జీవోతో విద్యారంగాన్ని విధ్వంసం చేసిందన్నారు. నూతన ప్రభుత్వం అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు రోజుకు రెండు సెషన్లలో టెట్ నిర్వహించి, నవంబరు 2న ఫలితాలు విడుదల చేస్తామని, 3న డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెబుతోందన్నారు. ఈ రకంగా చూస్తే 2024-25 విద్యా సంవత్సరంలో కూడా డీఎస్సీ లేనట్టేనని చెప్పారు. రాష్ట్ర పాఠశాల విద్యారంగంలో ఏడేళ్ల కాలంలో డీఎస్సీ లేకపోవడంతో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీవోను రద్దుచేసి విద్యారంగాన్ని గాడిలో పెడతామని చెబుతూనే పని సర్దుబాటు చేస్తోందన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి విద్యా వలంటీర్ల నియామకాలకు ఆదేశించటం ఏంటని ప్రశ్నించారు. విద్యాశాఖలో ఏ మార్పులు చేస్తామనేది ఉపాధ్యాయ సంఘాలతో, ఎమ్మెల్సీలతో చర్చిస్తామని మంత్రి నారా లోకేష్ చెప్పారని, ఇపుడు ఆ మాట ఏమైందని నిలదీశారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మాకు న్యాయం చేయండి

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 7: తమకు న్యాయం చేయాలని తిరుపతి రూరల్ మండలం కాలూరుకు చెందిన జయమ్మ, రమాదేవి విన్నవించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. తమ నివాస స్థలంలో గతంలో దేవదాయశాఖ అధికారులు ఆలయ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. దాంతో గుడి నీడ ఇంటిపై పడితే మంచిది కాదన్న కారణంతో ఉన్న స్థలంలో కొంత ఆలయానికి వదిలి.. మిగిలిన దాంట్లో ఇంటిని నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుతం ఆ ఇంటికి కూడా ఆలయ సైన్‌సైడ్ భాగం తగిలేలా ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నారని చెప్పారు. గతంలో వైసీపీ నేతల బెదిరింపులకు ఏమీ చేయలేక కోర్టును ఆశ్రయించామన్నారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టులో నడుస్తుందని.. అయినా కొందరు స్థానికులు ఉద్దేశపూర్వకంగా తమ ఇంటిని ఆనుకుని ఉండేలా గుడి నిర్మాణ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పాలకులు, అధికారులైనా తమకు న్యాయం చేయాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న జయమ్మ, రమాదేవి

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

తిరుపతి(విద్య), ఆగస్టు 7: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ముఖాముఖి చర్చా సమావేశం నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. 117 జీవోను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్లతరబడి పెండింగ్‌లోని డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మున్సిపల్ యాజమాన్యంలో పనిచేసి రిటైర్ అయిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి జగన్నాథం, ఆర్థిక కార్యదర్శి కఠారి మోహన్, రాష్ట్ర మహిళా కన్వీనర్ రేణుకా దేవి, రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, వేణుగోపాల్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రఘునాథ్‌రెడ్డి

ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతిగా జయచంద్రారెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7: ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ కుప్పా జయచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు హెడ్‌గా ఉన్న వెంకటేశ్వర్లు పదవీ కాలం పూర్తవడంతో ఈయన్ను నియమిస్తూ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డిని కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నర్సయ్య, ఫ్యాకల్టీ డీన్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అభినందించారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం: ఈఈ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 7: విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని టౌన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి ఆదేశించారు. టౌన్ డివిజన్ పరిధిలో నాలుగు సబ్‌డివిజన్ కేంద్రాల్లో బుధవారం సమస్యల పరిష్కార వేదిక నిర్వహించామన్నారు. ఈ కేంద్రాల్లో డీఈఈలు వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారని చెప్పారు. గత వారంలో వచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఫిర్యాదులు తీసుకున్న వారిలో డీఈఈలు అంజనేయులు, మునిప్రసాద్, ప్రభాకర్, ఏఈలు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. ● తిరుపతి రూరల్ డివిజన్‌లోని చంద్రగిరిలో జరిగిన కార్యక్రమంలో ఈఈ ఎన్.వాసురెడ్డి పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగంపై దాడులు

చిత్తూరు జిల్లా సోమల మండలంలో బుధవారం అక్రమ విద్యుత్ వినియోగంపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 92 కేసులు నమోదుచేసి, రూ.2.81లక్షల అపరాధ రుసుం విధించామని డీపీఈ, ఈఈ పి.బాలాజి తెలిపారు. విజిలెన్స్ అధికారులు పూర్ణచంద్రకుమార్, నరసింహమూర్తి, మాధవరావు, నరేంద్ర, డీఈఈలు హరినాథ్, రాజా, చలపతి, కృష్ణయ్య, ఏఈలు పాల్గొన్నారు.



చంద్రగిరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వాసురెడ్డి

చేనేత కార్మికులను కాపాడుకోవాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7: చేనేత వస్త్రాలను ఆదరించడం ద్వారా గ్రామీణ చేనేత వృత్తి కార్మికులను కాపాడుకోవాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ పిలుపునిచ్చారు. చేనేత దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వీసీ ఉమ తదితరులు

మత్తు పదార్థాల వాడకంతో అనారోగ్యం
స్విమ్స్ సైకియాట్రిస్ట్ దుర్గాంజలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7: మత్తు పదార్థాలను వాడటంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని స్విమ్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ దుర్గాంజలి తెలిపారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పాస్ కౌన్సెలర్ బాలస్వామినాయక్, న్యాయవాది అపర్ణాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో దుర్గాంజలి

ఎన్ఎస్‌యూలో ముగిసిన గ్రంథలిపి శిక్షణ



ప్రసంగిస్తున్న జీఎస్ఆర్ కృష్ణమూర్తి, తదితరులు

తిరుపతి రూరల్, ఆగస్టు 7: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో రెండువారాలపాటు అధ్యాపకులకు నిర్వహించిన గ్రంథలిపి శిక్షణ బుధవారంతో ముగిసింది. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. భారతీయ భాషలు అనేకం ఉన్నాయని, అందులో ఐదో శతాబ్దానికి చెందిన ప్రాచీన గ్రంథలిపిపై శిక్షణ నిర్వహించామని తెలిపారు. సంస్కృతంతోపాటు ఇతర భాషలపై కూడా జ్ఞానాన్ని సంపాదించేందుకు, తద్వారా మాతృక గ్రంథాలను పరిశోధించేందుకు ఈశిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రొఫెసర్ శంకరనారాయణ, కోఆర్డినేటర్ శివరామభట్, సాహిత్యసంస్కృతి డీన్ లలితారాణి, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, ఐక్యూఏసీ డైరెక్టర్ సతీశ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడిని బుధవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు రాష్ట్ర వాటా నిధుల విడుదల, నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగా భూమి కోల్పోయి పరిహారం అందనివారికి టీడీఆర్ బాండ్ల మంజూరు, శెట్టిపల్లె భూసమస్య, టీటీడీ అభివృద్ధి పనులు, తిరుమల, తిరుపతికి నీటి సరఫరా పెంపు, అన్న క్యాంటీన్ల పెంపు, అధికారుల పోస్టింగ్, బదిలీలు, ఐదేళ్లలో ఎన్డీఏ కూటమి నేతలపై పెట్టిన కేసుల ఎత్తివేతపై చర్చించారు. సీఎం సానుకూలంగా స్పందించడంతో ఆరణి కృతజ్ఞతలు తెలిపారు.



హైకోర్టు పీపీకి రవినాయుడి అభినందనలు



తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యువగళం వలంటీర్లు జైలుకెళ్లినప్పుడు అండగా ఉన్న సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ ఏపీ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా నియమితులైన సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విజయవాడలో పీపీని మర్యాదపూర్వకంగా కలిసి గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ అరాచకాల గురించి మాట్లాడుకున్నారు.

నైపుణ్యాల పెంపుతోనే ఉన్నతోద్యోగాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7: విద్యార్థి దశలో చదువుతోపాటు పారిశ్రామిక, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల ఉన్నతస్థాయి ఉద్యోగాలను సాధించవచ్చని తిరుపతికి చెందిన కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. పద్మావతి మహిళావర్సిటీలో ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా బీటెక్ ప్రవేశాలు పొందిన విద్యార్థులకు బుధవారం ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఉద్యోగసామర్థ్య నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెరీర్‌లో స్థిరపడేందుకు, కార్పొరేట్‌సంస్థల కొలువులు సాధించేందుకు తార్కిక ఆలోచనతో కూడిన పరిజ్ఞానం అవసరమని వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



పద్మావతి వర్సిటీలో మాట్లాడుతున్న శ్రీధర్

పాడిపశువుల ఉత్పత్తి, యాజమాన్యంపై శిక్షణ

తిరుపతి రూరల్, ఆగస్టు 7: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో లైవ్ స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగం(ఎల్‌పీఎం) ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఎస్సీ సబ్ ప్లాన్ ఆర్థిక సౌజన్యంతో బుధవారం పాడిపశువుల ఉత్పత్తి-యాజమాన్యంపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు దేవసేన, సురేష్‌బాబు, తేజ, వీణ హాజరై..పాడిపశువుల పోషణ, పునరుత్పత్తి, జాతుల ఎంపిక, గృహవసతి, పరాన్నజీవుల నివారణ, పాల ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్‌పీఎం హెడ్, ఆర్గనైజర్ జి.గంగరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెంపునకు ఇటువంటి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అతిథిగా వచ్చిన కళాశాల ఏడీ పి.జగపతిరామయ్య.. విద్యార్థులు, ఎస్ఎంఎస్‌లకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ వాణి పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధ్యాపకులు

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం

భాకరాపేట, ఆగస్టు 7: తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా చిన్నగొట్టిగల్లు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు కిరణ్మయి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాలు అందలేదు
అటవీశాఖ ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆవేదన



అటవీశాఖ అధికారిని కలిసేందుకు వచ్చిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

మంగళం, ఆగస్టు 7: నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్నామని తిరుపతి డివిజన్ పరిధిలోని అటవీశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కపిలతీర్థం వద్ద ఉన్న కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డిని అటవీశాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ తిరుపతి సర్కిల్ అధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షుడు సాయికిరణ్, కోశాధికారి మోహన్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలను పోషించడం భారంగా మారిందన్నారు. సతీష్‌రెడ్డిని కలిసి తమ బాధను చెప్పుకోవడంతో స్పందించిన ఆయన ఈనెల 12వ తేదీలోపు జీతాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వమైనా తమకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మచిలీపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 7: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం-తిరుపతి మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లు (07249-07250) నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంనుంచి ఈనెల 7,9 తేదీల్లో, తిరుపతినుంచి 8,9 తేదీల్లో ఈ రైళ్ల రాకపోకలు నిర్వహిస్తాయని తెలిపారు. మచిలీపట్నంలో బుధవారం ప్రత్యేక రైలు బయల్దేరి పెడన, గుడలవల్లేరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్ల మీదుగా మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుంది. గురువారం తిరుపతిలో బయల్దేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు ఉదయం మచిలీపట్నం చేరుకుంటుంది.

బాంద్ర-వేలాంకన్నికి 27న ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బాంద్రా (ముంబై)నుంచి వేలాంకన్నికి ఈనెల 27న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు(09093)బాంద్రాలో 27వతేది రాత్రి 9.20 గంటలకు బయల్దేరి బోరివలి, వశిరోడ్డు, పన్‌వేల్, లోనావాలా, పుణె, దౌండ్, షోలాపూర్, కల్‌బుర్గ్, వాడి, కృష్ణ, రాయచూర్, గుంతకల్, కడప, రేణిగుంట, కాట్పాడి, వేలూరు క్యాంట్, తిరువణ్ణామలై, విళ్ళుపురం, కడలూరుపోర్టు, చిదంబరం, శిరికాళై, మైలాడుతురై, తిరువారూర్, నాగపట్టణం మీదుగా రెండో రోజు ఉదయం 8.30 గంటలకు వేలాంకన్నికి చేరుకుంటుంది. వేలాంకన్ని నుంచి ఈ ప్రత్యేక రైలు(09094) అదేరోజు రాత్రి 10 గంటలకు బయల్దేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ రెండో రోజు మధ్యాహ్నం మూడు గంటలకు బాంద్రాకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు సెప్టెంబరు6న బాంద్రాలో, 8న వేలాంకన్నిలో బయల్దేరుతుంది.

భారీ వర్షానికి నేలకొరిగిన వరిపైరు



నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న అనిత

తడ, ఆగస్టు 7: మంగళవారం కురిసిన భారీ వర్షానికి వెండ్లూరుపాడు, మాంబట్టు పంచాయతీలోని వరిపైరు నేలకొరిగింది. పొట్టదశలో ఉన్న వరిపైరు నేలకొరగడంతో రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం వ్యవసాయశాఖ ఏడీఏ అనిత సంబంధిత పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఈ రెండు పంచాయతీలలో మొత్తం 305 ఎకరాలలో వరిపైరు సాగుచేస్తున్నారని, అందులో 150 ఎకరాలపైరు మంగళవారం కురిసిన వర్షానికి నేలకొరిగిందన్నారు. వేనాడు, కాదలూరులలో నెల క్రితం పైరు మాత్రమే సాగులో ఉండటంతో వాటికి ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. నష్టాల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఏవో కాంచన కూడా ఉన్నారు.

దేశాభివృద్ధికి యువత పునాది



మాట్లాడుతున్న న్యాయమూర్తి లోకనాథం

గూడూరు, ఆగస్టు 7: దేశాభివృద్ధికి యువత పునాదిలాంటివారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని న్యాయమూర్తి లోకనాథం సూచించారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసైతే జీవితాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఉన్నత ఆశయంతో సాంకేతికంగా అభివృద్ధి మార్గంలో పయనించి దేశానికి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రవిప్రసాద్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సు



మాట్లాడుతున్న జడ్జి భరత్‌కమల్, న్యాయవాదులు

కోట, ఆగస్టు 7: మండల పరిధిలోని విద్యానగర్ శ్రీనివాస జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాల పట్ల అవగాహనలేకపోతే కలిగే నష్టాలను వివరించారు. ఎస్‌ఐ నాగరాజు, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు ప్రస్తుత సమాజంలో నేర్చుకోవాల్సిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణమూర్తి, న్యాయవాదులు అత్తికాయల మోహన్, బాబురెడ్డి, రమణ, అశోక్ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జిని నిర్మించకుంటే సచివాలయ భవనానికి ప్రమాదం

తడ, ఆగస్టు 7: పెరియవట్టు వద్ద నిర్మిస్తూ అర్థాంతరంగా నిలిపివేసిన బాక్స్‌టైప బ్రిడ్జిని త్వరితగతిన పూర్తిచేయకుంటే పక్కనే ఉన్న సచివాలయ భవనానికి ముప్పు పొంచి ఉందని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. బుధవారం పెరియవట్టు వద్ద అర్థాంతరంగా ఆగిపోయిన రైల్వే బాక్స్‌టైప బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. పరిస్థితిని గమనించి అప్పటికప్పుడే చెన్నై సదరన్ రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ పరిస్థితిని వివరించారు. ఏడాదిగా నిర్మాణాన్ని అర్థాంతరంగా వదిలేశారని, అందుకోసం తీసిన గుంతలకు పక్కన ఉన్న మట్టి అంతా కరిగిపోతుందని, పక్కనే ఉన్న సచివాలయ భవనానికి ముప్పు ఉందని ఆయన తెలిపారు. ఈ సమస్యపై గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు వారంలోపు పనులు మొదలుపెట్టి, వీలైనంత త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో విజయకుమార్, డిప్యూటీ తహసీల్దారు శరత్, తదితరులు ఉన్నారు.

ప్రగడ కోటయ్య చిరస్మరణీయుడు



నివాళులు అర్పిస్తున్న చేనేత కళాకారులు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 7: చేనేత ఉద్యమ నేత ప్రగడ కోటయ్య చేనేతల్లో చిరస్మరణీయుడిగా నిలిపోయారని రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఐఐహెచ్‌టీలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు కోటయ్య కృషి చేశారన్నారు. ప్రజాబంధుగా ఆయనకు బిరుదు ఉందని కొనియాడారు. చేనేత అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఐఐహెచ్‌టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్ఠమైనవి



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

గూడూరు, ఆగస్టు 7: తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని డాక్టర్ మైథిలి అన్నారు. బుధవారం మైథిలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వలన పుట్టిన బిడ్డలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఎల్ రమణబాబు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు

కోట ఆగస్టు 7: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వారం రోజుల పాటు జరిగిన తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మల ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ చివరి రోజు వంజివాక, చెందోడు గ్రామాల్లో తల్లులు, ఐసీడీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెళ్లకూరు, ఆగస్టు 7: మండలంలోని దిగువ చావాలిలో పంచాయతీ స్థలం ఆక్రమణతో పాటు గ్రామ పంచాయతీ భవనం కిటికీ సన్‌సైడ్ బండలను ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన నింద్ర భూపయ్య పంచాయతీ భవనం కిటికీ సన్‌సైడ్ బండలను ధ్వంసం చేయడంతోపాటు పంచాయతీ స్థలాన్ని కూడా ఆక్రమించాడని శ్రీహరి తెలిపారు. పంచాయతీ భవనాన్ని నష్టపరిచిన భూపయ్యపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పలకల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 7: స్థానిక జీఎస్‌రాయల్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఉర్దూ పాఠశాలలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ మాట్లాడుతూ చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బషీరున్నీసాబేగం, సురేంద్రబాబు, ఆరీఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు అర్బన్, ఆగస్టు 7: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అనూషను బుధవారం ప్రధానోపాధ్యాయురాలు మముల్లాజాన్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన అనూష అండర్-17 హ్యాండ్‌బాల్, జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి, స్పోర్ట్ కోటాలో ఎంపికైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత



సమావేశంలో పాల్గొన్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, ఆగస్టు 7: పేద విద్యార్థుల చదువుల కోసం ఎస్వీ రత్నం చారిటీస్ చేయూతనందిస్తుందని చారిటీస్ నిర్వాహకుడు, చార్టెడ్ అకౌంటెంట్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. బుధవారం స్థానిక త్యాగరాజవీధిలోని సంస్థ కార్యాలయంలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువుల కోసం రూ.1,07,000 ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పేదవిద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వలన చదువు నిలిపివేయకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, బొమిడి శ్రీనివాసులు, గిరిబాబు, సనత్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు తహసీల్దార్‌గా రామయ్య

వాకాడు, ఆగస్టు 7: మండల నూతన తహసీల్దార్‌గా రామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వాకాడుకు వచ్చారు. వాకాడులో విధులు నిర్వహిస్తున్న నరసింహారావు సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ రామయ్యకు డీటీ సందీప్, ఆర్‌ఐ సెల్వరాజ్, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

దొరవారిసత్రం, ఆగస్టు 7: దొరవారిసత్రం తహసీల్దార్‌గా పి.సైలాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విడవలూరు నుంచి బదిలీపై విచ్చేసి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ అయిన ఆమెను అడహక్ తహసీల్దార్‌గా కలెక్టరు నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ ఉద్యోగులతో పాటు, మండల టీడీపీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.

కోట తహసీల్దార్‌గా జయజయరావు

కోట, ఆగస్టు 7: కోట తహసీల్దార్‌గా జయజయరావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. తడ మండల తహసీల్దారుగా పనిచేస్తున్న జయజయరావును కోటకు బదిలీ చేయగా, ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది, పలువురు అధికారులు తహసీల్దార్‌ను అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

సూళ్లూరుపేట, ఆగస్టు 7: సూళ్లూరుపేట తహసీల్దార్‌గా ఎస్వీ నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు వచ్చిన తహశీల్దార్ బదిలీపై గుంటూరుకు వెళ్లడంతో వాకాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న నరసింహారావును సూళ్లూరుపేటకు నియమించారు.

చేనేతలను ఆదుకోండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాధవ నాయుడు, రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 7: వెంకటగిరి చేనేతలను అన్ని విధాల ఆదుకోవాలని అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలెక్టరు వెంకటేశ్వర్‌ను కోరారు. బుధవారం వెంకటగిరిలో ఏర్పాటు చేసిన చేనేత దినోత్సవ సభకు హాజరయ్యేందుకు వచ్చిన కలెక్టరును వారు ముందుగా తెలుగుగంగ అతిథి గృహంలో కలుసుకొన్నారు. ఈ సందర్భంగా హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ విద్యార్థులు నిర్వహించిన చేనేత దినోత్సవ ర్యాలీలో వారు పాల్గొన్నారు. కలెక్టర్‌ను, ఎమ్మెల్యేని ఐఐహెచ్‌టీ ప్రిన్సిపాల్ గిరధరరావు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. నియోజకవర్గ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పలు విషయాలపై చర్చించారు. - చిత్తూరు కలెక్టరేట్

పుట్టిన గడ్డను మరవను

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న వెంపటి మాధవ నాయుడు

డక్కిలి, ఆగస్టు 7: పుట్టిన గడ్డను ఊపిరి ఉన్నంతవరకు మర్చిపోనని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ సొంతూరైన డక్కిలి మండలం పాతనాలపాడులో బుధవారం గ్రామస్తులు విజయోత్స సభ నిర్వహించగా, ఎమ్మెల్యే సతీమణి సింధు, కుమార్తె లక్ష్మీసాయి ప్రియలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వెంకటగిరి నుంచి తనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. దివంగత నేత రాపూరు మాజీ ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నం నాయుడు రాజకీయాల్లో తనకు ఆదర్శమన్నారు. అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ నిత్యశ్రామికుడని, అందుకే ఆయన్ను ఇప్పటికీ ఇక్కడి ప్రజలు ఆదర్శిస్తున్నారని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులను యువత గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, సీసీ నాయుడు, తిరుపతి సింధూరపార్కు అధినేత వెంకయ్య, రావి మస్తాన్ నాయుడు, సత్యం, వేమాను యువరాజ్, కురుగొండ్ల శ్రీనివాసులు, సురేంద్ర, నల్లాని రామచంద్రయ్య, మురళి, జయచంద్ర, రాజేంద్ర, రాజా, చందు, రాంబాబు, గట్టమనేని వెంకటరమణ, నరసయ్య నాయుడు, అధికారులు తదితరులు ఉన్నారు.

కమ్మవారిపల్లిని దత్తత తీసుకొంటా: కురుగొండ్ల సింధు

కమ్మవారిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి సింధు ప్రకటించారు. టీడీపీ విజయోత్సవ సభకు హాజరైన ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త కురుగొండ్ల రామకృష్ణ జన్మించిన కమ్మవారిపల్లి(పాతనాలపాడు) గ్రామంలో మౌళిక వసతులు కల్పించడంతో పాటు జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు నేనే బాధ్యత తీసుకొంటానని ఆమె ప్రకటించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

నేటి నుంచి విద్యాకమిటీ చైర్మన్‌ల ఎన్నిక

● గోవిందపల్లి, కేశవరం, సిద్ధమ్మకండ్రిగ పాఠశాలకు పోలీస్ బలగాలు..?

కోట, ఆగస్టు 7: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం విద్యాకమిటీ ఎన్నికలు జరగనున్నాయి. చేతులెత్తే విధానం ద్వారా ఆయా విద్యాకమిటీ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అటు అధికార టీడీపీ, ఇటు వైసీపీ నాయకులకు ఈ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. మండలంలోని 21 పంచాయతీలకు గాను 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, చిట్టేడులోని యానాదుల బాలుర గురుకులం, కోటలోని యానాదుల బాలికల గురుకుల పాఠశాలలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో సుమారు 6వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి పేరెంట్స్ ఈ ఎన్నికల్లో చేతులెత్తే విధానం ద్వారా చైర్మన్‌లను ఎన్నుకోనున్నారు. కోట మండలంలో కేశవరం, రాఘువాపురం, సిద్ధమ్మకండ్రిగ, గోవిందపల్లి పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. టీడీపీ, వైసీపీల నేతలు నువ్వా నేనా అన్న చందాన స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగా పేరెంట్స్‌ను కలిసి ఆయా పాఠశాలలకు హామీల వర్షం కురిపిస్తున్నారు. పోలీసులు సమస్యాత్మక పాఠశాలలపై డేగ కన్ను వేశారు.

గోదాదేవికి అభిషేకం



సూళ్లూరుపేట, ఆగస్టు 7: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి జన్మనక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ తెలిపారు. ముందుగా గోదాదేవి ఉత్సవమూర్తిని ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చి కలశాలతో జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. గాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాపా మల్లయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

15న అన్నక్యాంటీన్ ప్రారంభానికి ఏర్పాట్లు




గూడూరులో సిద్ధం చేస్తున్న అన్నక్యాంటీన్ భవనం - నాయుడుపేటలో పరిశీలిస్తున్న కమిషనర్

గూడూరు, ఆగస్టు 7: గత టీడీపీ ప్రభుత్వంలో పేదలందరూ మూడుపూటలా కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశ్యంతో స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో మంది పేదలకు నామ మాత్రపు నగదుతో కడుపులు నింపింది. ఈ అన్నక్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేసి, ఆ భవనంలో సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో పేదల నోటి దగ్గర కూడును వైసీపీ ప్రభుత్వం లాగి వేసిందన్న విమర్శలు వచ్చాయి. ఇటీవల ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తిరిగి పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు, ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించేలా ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో పట్టణంలోని అన్నక్యాంటీన్ భవనంలో ఉన్న సచివాలయాన్ని మరో ప్రాంతానికి తరలించి, అన్నక్యాంటీన్‌ను తిరిగి సిద్ధం చేసేలా మున్సిపల్ అధికారులు పనులు వేగవంతంగా చేపడుతున్నారు. ఈ నెల 15వ తేదీన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు.

నాయుడుపేట: ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వంలో సచివాలయంగా మార్చివేశారు. ప్రస్తుతం అన్న క్యాంటీన్‌లో ఉన్న సచివాలయాన్ని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుటకు తరలించారు. పాత అన్న క్యాంటీన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి స్థానికులతో పాటు నాయుడుపేటకు వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలకు కూడా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 7: నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజవకర్గ పరిధిలోని వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిపనుల వివరాలను వెంటనే అందజేయాలన్నారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో రైతులు గోకులాలు, మినీ షెడ్లు నిర్మించుకున్నారని, వాటికి బిల్లులు త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి పనులు జరగలేదని, ఈ ప్రభుత్వంలో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కిషోర్ నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చెంచురామయ్య మట్టం శ్రావణి, లీలావతి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల పట్ల అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఓజిలి, ఆగస్టు 7: తరచుగా వానలు కురుస్తున్న క్రమంలో అంటువ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఓజిలి మండలం అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు అన్నారు. ఓజిలి మండలం పున్నేపల్లిలో బుధవారం గ్రామస్తులు, సంఘబంధం సభ్యులకు అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు స్వచ్ఛమైన నీటిని తాగటం ద్వారా అంటు వ్యాధులను అడ్డుకోవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో అత్తివరం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజగోపాల్, చిన్నయ్య, వైద్యసిబ్బంది ఝాన్సీ, మల్లీశ్వరి,జ్యోతి, ఆశావర్కర్ సిద్ధమ్మ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండ



చేనేతల సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 7: అంతరించిపోతున్న చేనేత కళ, కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నూరులో చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకుని వారిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేష్, బాలసుబ్రమణ్యం, శివకుమార్, క్రాంతి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చిల్లకూరు, ఆగస్టు 7: మండల కేంద్రమైన చిల్లకూరులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, నాయకులతో కలిసి గ్రామంలోని దళితవాడలు, మిక్సిడ్‌కాలనీ, శంకరన్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, బెల్లంకొండ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కారూరులో మారియమ్మన్ జాతర



అంబళ్లను సమర్పిస్తున్న భక్తులు

తడ, ఆగస్టు 7: మండల పరిధిలోని కారూరు గ్రామదేవత మారియమ్మన్ జాతర బుధవారం మొదలైంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో జాతర చాటింపు వేయగా, ఉదయం గ్రామస్తులు పొంగళ్లు, అంబళ్లతో ఊరేగింపుగా మారియమ్మన్ గుడికి తరలివెళ్లారు. అక్కడ అమ్మణ్ణికి సమర్పించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మకు పొంగళ్లను పొంగించి, నైవేద్యంగా సమర్పించారు. అర్ధరాత్రి నుంచి అమ్మణ్ణి గ్రామోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కంపేటలో గ్రామదేవత పోలేరమ్మకు జాతర నిర్వహించారు.

నగరి మండలాభివృద్ధికి సమష్టి కృషి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 7: రాజకీయాలకతీతంగా సమష్టిగా నగరి మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. నగరి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భార్గవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి, పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 32 పనులను గుర్తించి మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం అనుసంధానంతో రోడ్డు పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. పామోలిన్ సాగుపై అధిక సబ్సిడీలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పామోలిన్ సాగు చేపట్టి 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు సబ్సిడీ అందలేదని, పెంపకంపై అవగాహన కల్పించలేదని అయనంబాకం గ్రామ రైతు సురేషనాయుడు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ రవికుమార్, జడ్పీటీసీ గాంధీ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'అమరరాజా'లో 96 మందికి ఉద్యోగాలు

- నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపికలు



యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 7: ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థ, కరకంబాడిలోని అమరరాజా కంపెనీలో 96 మంది యువతీ యువకులు అప్రెంటీస్ ఉద్యోగాలు పొందారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమరరాజా కంపెనీలో మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు ఎంపికలు బుధవారం నిర్వహించింది. ఇంటర్, ఐటీఐ, పదో తరగతి పాస్, ఫెయిల్ 126 మంది యువతీ యువకులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు వి.కళ్యాణ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు ఆర్.లోకనాథం, గణేష్, మహేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 96 మంది ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి కనీస వేతనం కింద నెలకు రూ.12,500 నుంచి రూ.13,500 వరకు ఇస్తారని అధికారులు వెల్లడించారు.

అమ్మపాలు అమృతతుల్యం



ర్యాలీ చేస్తున్న అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు

పిచ్చాటూరు, ఆగస్టు 7: అమ్మపాలు అమృతతుల్యం అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి శోభారాణి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకత, విశిష్టత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. అనంతరం 'తల్లిపాలే ముద్దు... పోతపాలు వద్దు' అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మారెమ్మ, బేబి, కల్పలత, సుమతి, శ్రీదేవి, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ శాంతి, సీహెచ్‌వో శివయ్య, నాలుగు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు మురళీకృష్ణ



ప్రత్యేక రాహుకేతు పూజలు చేసుకుంటున్న దర్శకుడు మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం సినీ దర్శకుడు ఎస్ఎస్ మురళీకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ వచ్చే నెలలో సాయిరాం శంకర్ కథా నాయకుడుగా నటించిన రీసౌండ్ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పేడు తహసీల్దారుగా భార్గవి



తహసీల్దారును ఆశీర్వదిస్తున్న వేదపండితుడు

ఏర్పేడు, ఆగస్టు 7: ఏర్పేడు తహసీల్దారుగా భార్గవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఎన్నికల ముందు బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దారుగా పనిచేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై కర్నూలు జిల్లా నంద్యాలకు వెళ్లారు. అక్కడ నుంచి రిలీవ్ అయి జిల్లాకు వచ్చిన ఆమెను ఏర్పేడు తహసీల్దారుగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు డీటీ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ నల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గోతులమయంగా రాజరాజేశ్వరి ఆలయం రోడ్డు



అధ్వానంగా ఉన్న రోడ్డు

రేణిగుంట, ఆగస్టు 7: రేణిగుంట పంచాయతీ పరిధిలోని రాజరాజేశ్వరి ఆలయం, భగత్‌సింగ్ కాలనీకి వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. సంత గేటు నుంచి సకాల వీధి, వసుంధరా నగర్, భగత్‌సింగ్ కాలనీ, రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లే ప్రధానమైన రోడ్డు గోతులమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొంతకాలంగా రేణిగుంట, తిరుపతి బైపాస్ రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు సాగుతుండటంతో ఈ రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డులో మరింత ఎక్కువయ్యాయి. చిన్నపాటి వర్షానికి సైతం గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉందాం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: చేనేత కార్మికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చాగణం శైలజ అన్నారు. చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని భాస్కరపేటలోని చేనేత కార్మికులను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉమాసింగ్, ప్రజ్ఞశ్రీ, అకమ్మ, దేవి, కొండేటి గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: చేనేత దినోత్సవం సందర్భంగా మాజీ ఎంపీటీసీ బండారు మోహన్‌బాబు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ పిలుపిచ్చిన స్వదేశీ ఉద్యమంలో చేనేత రంగం ప్రముఖ పాత్ర పోషించిందని గుర్తు చేశారు. నేటి ఆధునిక యుగంలో కూడా నేతన్నలు నేసిన పట్టు వస్త్రాలకు మార్కెట్‌లో ఇంకా డిమాండ్ ఉందంటే అది చేనేత రంగం గొప్పతనమన్నారు. ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్న చేనేత రంగాన్ని, కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, మల్లికార్జున్, శివానందం, రాజ, జనార్థన్, సుబ్రమణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని చావాలి లింగమనాయుడుపల్లెలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. సీనియర్ చేనేత కార్మికుడు యెర్రా మునికృష్ణయ్యను సత్కరించారు. చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గులపల వెంకటరమణయ్య మాట్లాడుతూ చేనేత వృత్తిని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో గుత్తి త్యాగరాజు, జీలగ రేవతి, మల్లీశ్వరి, విజయభాస్కర్, చంద్రశేఖర్, మునిచంద్రయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ముగిసిన పోలేరమ్మ జాతర



వీధుల్లో ఊరేగుతున్న పోలేరమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 7: మండలంలోని గాజులపెళ్లూరులో దేవత పోలేరమ్మ జాతర బుధవారంతో ముగిసింది. అమ్మవారి విగ్రహానికి పాలభిషేకం చేసి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వేతనాలు ఇప్పించండి



డీఎఫ్‌వోతో మాట్లాడుతున్న అటవీశాఖ సిబ్బంది

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: నాలుగు నెలలుగా బకాయి ఉన్న తమ జీతాలను ఇప్పించాలని అటవీశాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. తిరుపతిలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం డీఎఫ్‌వోను కలిశారు. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఎఫ్‌వో ఈనె 12వ తేదీలోగా నాలుగు నెలల జీతాలు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని టీడీపీ నాయకులు అన్నారు. శ్రీకాళహస్తి మండలం వెలంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో కలిసి శుభదిన భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరికృష్ణ నాయుడు, మల్లికార్జున్ నాయుడు, రత్నం యాదవ్, హరి యాదవ్, చెంచయ్య యాదవ్, మల్లికార్జున్, మునికృష్ణమ నాయుడు, మనోహర్‌రెడ్డి, ధర్మయ్య, నాగేశ్వర్‌రెడ్డి, రామరాజు, మురగయ్య, మంకయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలను సిద్ధం చేయండి



తహసీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం/పిచ్చాటూరు, ఆగస్టు 7: సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్ల పట్టాల కోసం సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం నాగలాపురంలోని ఏఎంసీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల తహసీల్దార్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీపేటలో నూతనంగా నిర్మిస్తున్న రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాలు ప్రభుత్వ భూమిలో 400మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో శ్మశాన స్థలం లేని హరిజనవాడలకు వెంటనే స్థలం కేటాయించాలన్నారు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఆలయాలు, పాఠశాలలు, ఇళ్ల, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణ పనులకు ఇసుక, మట్టి, గ్రావెల్, తరలించుకునేందుకు అనుమతులివ్వాలని, ఇతర వ్యాపారాలకు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా సత్యవేడు, నాగలాపురం తహసీల్దార్లు చొరవ చూపాలన్నారు. సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం, అంబేడ్కర్ భవన్ పనులకు ల్యాండ్ క్లియరెన్స్ ఇవ్వాలని సత్యవేడు తహసీల్దారుకు సూచించారు. ఆరణియార్ కట్టకింద ఆక్రమణలను తొలగించి ఉద్యానవన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు టీవీ.సుబ్రహ్మణ్యం, ఐ.సుబ్రహ్మణ్యం, హనుమాన్ నాయక్, దస్తగిరయ్య, జయరాములు, రమేష్‌బాబు, సీఐ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే స్థానిక పోలేరమ్మ ఆలయాన్ని సందర్శించారు.

ఆక్రమణ నుంచి శ్మశాన స్థలాన్ని కాపాడండి



వినతిపత్రం ఇస్తున్న జమాత్ సభ్యులు

నాగలాపురం, ఆగస్టు 8: ఆక్రమణలో ఉన్న శ్మశాన స్థలాన్ని కాపాడాలని నాగలాపురం ముస్లిం జమాత్ సభ్యులు బుధవారం తిరుపతి వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగలాపురం సర్వేనెంబర్ 969/846లోని ముస్లిం శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడం కాకుండా తమపై అక్రమ కేసులు పెట్టారని వాపోయారు. ఈవిషయంలో వక్ఫ్‌బోర్డు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమాత్ సభ్యులు బాబు సాహెబ్, ముజుకుర్ రహీం, టిప్పు సుల్తాన్, రహీం, అబ్దుల్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ మహల్‌కు స్థలం కేటాయించండి

నాగలాపురం, ఆగస్టు 8: మండలంలోని టీపీకోట గ్రామంలో షాదీ మహల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మైనారిటీ నాయకులు తహసీల్దార్ హనుమాన్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను మాజీ సర్పంచు షమీవుల్లా ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. షాదీ మహల్ కోసం విన్నవించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నజీర్ సాహెబ్, రషీద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

వరదయ్యపాళెం, ఆగస్టు 7: వరదయ్యపాళెం మండలం తొండంబట్టు పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోదండనాయుడు మరణించారు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. కోదండనాయుడు చిత్రపటానికి నివాళు లర్పించారు. అలాగే మత్తేరిమిట్ట పంచాయతీకి చెందిన రవిరెడ్డి తల్లి సరోజమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు నిర్మల్, చలపతి నానయుడు, నాగరాజుయాదవ్, మల్లినాయుడు, ఆదిశేషు, గోవిందయ్య, వెంకీరాజ్, శివ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచు బాలాజీ పెద్దమ్మ, కళత్తూరు గ్రామానికి చెందిన పన్నీరు భార్య ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామాంజులు నాయుడు, గోపీనాథరెడ్డి, సాధు తదితరులు ఉన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 7: మండలంలో ప్రతిఒక్కరికీ కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి దివాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్వాడీ, ఆశా, వైద్య సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపుపై నొప్పిలేని బొడిపెలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు వంటి లక్షణాలే ఉండేవారిని పరిశీలించాలన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన సుధీర్‌రెడ్డి



మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతి విమానాశ్రయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తిరుపతి ఉంచి మరిన్ని విదేశీ విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను కలిసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను మంజూరు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలపై విచారణ

కేవీబీపురం, ఆగస్టు 7: మండలంలోని ఓళ్లూరు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లీలావతి ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక సర్పంచు సురేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీవో కుమారస్వామి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించి పీడీకి నివేదిక అందజేస్తామని చెప్పారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

శ్రీకాళహస్తి, ఆగస్టు 7: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్, యాంటీ టొబాకోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రజ్ఞశ్రీ, అధ్యాపకులు నాగయ్య, తులసిన బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా రవిచంద్రబాబు



పిచ్చాటూరు, ఆగస్టు 7: పిచ్చాటూరు మండల విద్యుత్‌శాఖ ఏఈగా రవిచంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఫ్రెషర్స్ డే

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 7: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే బుధవారం నిర్వహించారు. ప్రాధానోపాధ్యాయుడు రమణయ్య మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జీవిత గమ్యాలను నిర్దేశిస్తుందని, విద్యార్థులు తమ గమ్యాన్ని చేరడా నికి కృషి పట్టుదలతో ప్రయత్నించాలన్నారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు.

పుత్తూరు వార్తలు

అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలన



అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు టౌన్, ఆగస్టు 7: పట్టణంలోని సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎంఎన్ రెడ్డి పరిశీలించారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని అదేశించారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 7: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో తిరుపతిలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఉషారాణి, ఉమేష్ చంద్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

వడమాలపేట, ఆగస్టు 7: తల్లిపాలతో పసిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి చెప్పారు. బుధవారం మండలంలోని టీసీ అగ్రహారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు పిల్లల మేధస్సును పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.



టీసీ అగ్రహారంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

మాజీ సర్పంచు తల్లికి ఎమ్మెల్యే నివాళి



సుభద్రమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు టౌన్, ఆగస్టు 7: పుత్తూరు మండల పరిధిలోని కేబీఆర్ పురం మాజీ సర్పంచు, పరమేశ్వర మంగళం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు ఎస్.మోహన్ రాజు తల్లి సుభద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కేబీఆర్‌పురం వెళ్లి సుభద్రమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గంజీ మాధవయ్య, తడుకు సర్పంచు బొబ్బిలి వెంకటేష్, కేబీఆర్‌పురం మాజీ ఉప సర్పంచు మహేష్, టీడీపీ నాయకులు ఉన్నారు.

టైలరింగ్ సామగ్రి అందజేత



టైలరింగ్ సామగ్రి అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత

పుత్తూరు టౌన్, ఆగస్టు 7: రాష్ట్రీ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన 40మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్ సామగ్రిని యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ అధికారి హరి, రాస్ అధికారి రవి, ప్రకాష్, దివాకర్, మునిశేఖర్, జయంతి, బాలమ్మ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 7: చేనేత వస్త్రాలను ఆదరించాలని చాలని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిదరాజు అన్నారు. బుధవారం గేటు పుత్తూరులో చేనేత కార్మికులు నేసిన వస్త్రాలతో తాత్కలిక దుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మణి, కార్యదర్శి శంకర్, పొన్నప్పన్, రమేష్, సౌందర్‌పాండి, గణేష్, రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.